సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం ◆ 11 ◆ అక్టోబర్ ◆ 2023



ఉల్లం'ఘను'లపై దృష్టి

ఎన్నికల నిబంధనల అమలు, ఉల్లంఘనల పై ఎన్నికల కమిషన్ దృష్టిసారించింది.

వివరాలు 10లో ▸



వైభవంగా అగ్నిగుండం

మన్యంకొండ ఆలయంలో వీరభద్రస్వామి అగ్నిగుండం వైభవంగా కొనసాగింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /18.4

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

కందనూలు: జిల్లాకేంద్రంలోని శ్రీపురం రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ (ఆర్ట్స్, కామర్స్) కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన్‌శర్మ మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. 2018 నుంచి 2023 వరకు పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి బయోడేటాతో జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి: వట్టెంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 సంవత్సరానికి గాను 9, 11వ తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 31 వరకు నవోదయ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపల్ భాస్కర్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన విద్యార్థులు తమ ఆధార్‌కార్డు ఓటీపీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

31న నాటకీకరణపోటీలు

కందనూలు: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో చదువుతున్న 8, 9 తరగతుల విద్యార్థులకు నాటకీకరణ జిల్లాస్థాయి పోటీలు ఈ నెల 31న జిల్లాకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు డీఈఓ గోవిందరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యంగా ఎదగడం, మానవ శ్రేయస్సులో పోషకాహార పాత్ర, శారీరకంగా, మానసికంగా, ఉద్వేగం, లైంగిక పరమైన అంశాల్లో క్షేమంగా జీవించడం, అంతర్జాల పరికరాలు, సామాజిక మాధ్యమాలను సానుకూలంగా వినియోగించడం, మాదకద్రవ్యాల వినియోగానికి కారణాలు, వాటి నివారణపై తెలిపిన అంశాల నుంచి ఏదేని ఒక అంశాన్ని 5 లేక 6 నిమిషాలలో నాటకీకరణ ద్వారా పాఠశాల యూనిఫాంలోనే చేయాలన్నారు. పోటీలో పాల్గొనే జట్టులో గరిష్ఠంగా ఐదుగురు విద్యార్థులు ఉండాలని, పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి సెల్ నం.99899 21105ను సంప్రదించాలని కోరారు.

లక్కీడ్రా బాక్స్‌ను వినియోగించుకోండి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాఖీ పౌర్ణమి తరహాలోనే దసరాకు లక్కీడ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి, వారిని ఘనంగా సత్కరించాలని ఆర్టీసీ సంస్థ నిర్ణయించినట్లు రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లక్కీడ్రాలో గెలుపొందే ప్రయాణికులకు రూ.11లక్షల నగదు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రీజియన్‌కు ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు, 28 నుంచి 30 తేదీల్లో బస్సుల్లో ప్రయాణించే వారందరూ ఈ లక్కీడ్రాలో పాల్గొనవచ్చని, ఆయా తేదీల్లో ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనక పేర్లు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేయాలని కోరారు. ప్రతి రీజియన్ పరిధిలో లక్కీడ్రా నిర్వహించి 10 మంది విజేతలను ఎంపికచేస్తామని తెలిపారు.

పీయూలో ప్రీఆర్‌డీ ఎంపిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ప్రీ రిపబ్లిక్ డేకు సంబంధించి ఎంపికలు నిర్వహించారు. పీయూలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పరేడ్‌లో పాల్గొనేందుకు రన్నింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు దేశరాజధాని ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవం పరేడ్‌లో పాల్గొననున్నారు.

పకడ్బందీగా పహారా..

- ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలుపరుస్తాం
- రూ.50 వేలకుపైగా నగదు పట్టుబడితే లెక్క చూపాలి
- జిల్లా నలుమూలలా చెక్‌పోస్టులతో నిరంతరం నిఘా
- వంద నిమిషాల్లోనే ఫిర్యాదుల పరిష్కారం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎస్పీ మనోహర్



సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలును పక్కాగా పర్యవేక్షిస్తామని, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎస్పీ కె.మనోహర్ అన్నారు. కోడ్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన సందర్భంగా 'సాక్షి' నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో అందరికీ సమానమైన అవకాశం కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలలా పకడ్బందీగా పహారా చేపడుతున్నట్టు వివరించారు. జిల్లా ప్రజలు బాధ్యతగా వ్యవహరించి, ఎన్నికల నిర్వహణలో అధికారులకు సహకరించాలని కోరారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రత్యేక బృందాల ఏర్పాటు

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, ప్రజలంతా నిబంధనలను పాటించాలని ఎస్పీ మనోహర్ విజ్ఞప్తి చేశారు. అమ్రాబాద్ మండలం మన్ననూర్ కేంద్రంగా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుతో పాటు వెల్దండ, పెంట్లవెల్లి మండలం జటప్రోల్, బిజినేపల్లి మండలం మంగనూరు, తిమ్మాజిపేట తదితర ప్రాంతాల్లో జిల్లాస్థాయి చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నాం. నియోజకవర్గానికి మూడు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైయిలెన్స్ బృందాలు నిరంతరం పనిచేస్తాయి. ఒక్కో బృందానికి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ స్థాయి అధికారి సారథ్యం వహిస్తారు. స్టాటిక్ టీంలు ఒకచోట ఉండి పహారా నిర్వహిస్తుండగా.. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నియోజకవర్గం వ్యాప్తంగా తిరుగుతూ ఆకస్మిక తనిఖీలు చేపడతాయి. వీటికి అదనంగా ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, బ్లూకోట్స్, పెట్రోలింగ్ టీంలు యథావిధిగా విధులు నిర్వహిస్తాయి.

అనుమతి తప్పనిసరి..

'ఇకపై రాజకీయ సభలు, సమావేశాలు, మైక్ వినియోగానికి తప్పనిసరిగా పోలీసు శాఖ నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. ఇందు కోసం ఈ– సువిధ యాప్ అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే అన్ని పార్టీలకు నిబంధనల ప్రకారం అవకాశం కల్పిస్తారు. కోడ్ అమలులో ఉన్నకాలంలో జిల్లాలో ఎక్కడా నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు నిర్వహించేందుకు అవకాశం ఉండదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ఫిర్యాదులను ఈ విజిల్ యాప్ ద్వారా అందజేయవచ్చు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లోనే సమస్య పరిష్కారానికి చర్యలు ఉంటాయి. ఎక్కడైనా అల్లర్లు జరిగితే శాంతిభద్రతల నిర్వహణకు ప్రజలు 100 నంబరుకు ఫోన్ చేయవచ్చు. గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణకు అనుమతి లేదు. వాటి మూసివేతకు చర్యలు తీసుకుంటున్నాం.

నగదుకు లెక్క చూపాలి..

చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో రూ.50 వేలకు మించి నగదు పట్టుబడితే అందుకు తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుంది. రూ.10 లక్షల వరకు జిల్లాస్థాయి కమిటీ పరిశీలన చేపడుతుంది. రూ.10 లక్షల నగదు దాటితే ఇన్‌కం టాక్స్ శాఖ పరిధిలోకి వెళ్తుంది. కోడ్ అమలులోకి వచ్చిన సోమవారం ఒక్కరోజునే జిల్లావ్యాప్తంగా లెక్కా పత్రం లేకుండా లభించిన రూ.6 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నాం. ఇందులో కొల్లాపూర్ మండలంలో రూ.3.50 లక్షలు, పెద్దకొత్తపల్లి మండలంలో రూ.50 వేలు, కల్వకుర్తి మండలంలో రూ.2 లక్షల చొప్పున నగదును పోలీస్‌శాఖ స్వాధీనం చేసుకుంది. నగదుతోపాటు ఓటర్లకు కుక్కర్లు, గడియారాలు, చీరలు వంటి వస్తువులు పంపిణీ చేస్తూ ప్రలోభాలకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తాం. ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ల విషయంలోనూ సంబంధిత బ్యాంకులకు ఇప్పటికే ఈసీ నుంచి ఆదేశాలు వచ్చాయి. పెద్దమొత్తంలో నగదు పంపిణీ, వ్యవహారాలపై సంబంధిత సంస్థలు నిశితంగా పరిశీలిస్తున్నాయి.

● నిన్న గద్వాల.. నేడు నాగర్‌కర్నూల్

రాజధానిలో వార్..!

కాంగ్రెస్‌లో తారస్థాయికి చేరిన అసెంబ్లీ టికెట్ల లొల్లి

- వార్‌రూం వద్ద ప్లకార్డులతో నడిగడ్డ, కొల్లాపూర్ నేతల నిరసన
- తాజాగా గాంధీభవన్ వద్ద రేవంత్‌ను అడ్డుకున్న నాగం వర్గీయులు
- వనపర్తి, మక్తల్, నారాయణపేట, దేవరకద్రలోనూ మంటలు
- మహబూబ్‌నగర్‌లో స్థానిక, బీసీ కుంపటి



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కాంగ్రెస్‌లో అసెంబ్లీ టికెట్ల పంచాయితీ తారస్థాయికి చేరింది. మారిన రాజకీయ పరిణామాల క్రమంలో ఉమ్మడి పాలమూరుకు చెందిన పలువురు ముఖ్య నేతల చేరికలతో పార్టీలో ఉత్సాహం నెలకొన్నప్పటికీ.. ఆశావహుల తిరుగుబాటుతో రాజుకున్న అగ్గి తీవ్రరూపం దాల్చింది. నిన్న ఢిల్లీలో వార్ రూం ఎదుట గద్వాల, కొల్లాపూర్.. తాజాగా హైదరాబాద్‌లోని గాంధీభవన్ వేదికగా నాగర్‌కర్నూల్‌కు చెందిన నేతలు ఆందోళనకు దిగడం 'చే'జారిపోయే పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. మరోవైపు మక్తల్, నారాయణపేట, దేవరకద్ర నియోజకవర్గాల్లో అభ్యర్థిత్వాలకు బహుముఖ పోరు కొనసాగుతోంది. మహబూబ్‌నగర్ సెగ్మెంట్‌లో స్థానికత, బీసీ అంశం పార్టీని కుదిపేస్తోంది. ఈ పరిణామాలు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న హస్తం పెద్దలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు తెలుస్తోంది.

అటు ఇటుగా మక్తల్, పేట..

మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ కోసం నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్ పోటీపడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరగా ఆమె కుమారుడు సైతం టికెట్ రేస్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వీరే కాకుండా మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి మనవరాలు, దివంగత చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి కుమార్తె పర్ణికారెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. నారాయణపేట నుంచి ఆమెను బరిలో నిలపాలని మొదట భావించినా.. ఆ తర్వాత మార్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. జడ్చర్లకు చెందిన ఎర్రశేఖర్ నారాయణపేట నుంచి పోటీ చేసే అవకాశం ఉంది. అయితే కుంభం శివకుమార్‌రెడ్డి తొలుత స్తబ్దుగా ఉన్నప్పటికీ.. తన అనుచరుల ఒత్తిడితో టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నారాయణపేట, మక్తల్ టికెట్ల అంశం పెండింగ్‌లో పెట్టగా సామాజిక వర్గాల ప్రాతినిధ్యం మేరకు కేటాయింపులు ఉంటాయని కాంగ్రెస్ పెద్దలు చెప్పినట్లు సమాచారం.

మహబూబ్‌నగర్‌లో స్థానికత, బీసీ కుంపట్లు

బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఆయన మహబూబ్‌నగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలవనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో పార్టీలోని పలువురు సీనియర్ల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నియోజకవర్గ టికెట్ కోసం డీసీసీ మాజీ అధ్యక్షుడు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్‌తో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ ఆశలు పెట్టుకున్నారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇవ్వొద్దని.. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని కాపాడుకుంటూ వచ్చామని.. స్థానికత, బీసీ కోటాలో తమలో ఎవరికైనా టికెట్ కేటాయిస్తే గెలిపించుకుంటామని పార్టీ పెద్దల వద్ద ప్రస్తావించినట్లు సమాచారం.

ప్లకార్డులు.. అడ్డగింతలు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న టికెట్ల లొల్లి అటు దేశ రాజధాని న్యూఢిల్లీ, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చేరడం చర్చనీయాంశంగా మారింది. గద్వాల అసెంబ్లీ టికెట్‌ను బీఆర్‌ఎస్ కోవర్టు సరితా తిరుపతయ్యకు ఇవ్వొద్దు.. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారమే టికెట్లు కేటాయించాలి.. పారాచూట్ లీడర్లకు ఇవ్వొద్దంటూ టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కుర్వ విజయ్‌కుమార్, కొల్లాపూర్ టికెట్‌ను ఉస్మానియా విద్యార్థి కోటాతో పాటు బీసీ కేటగిరిలో తనకు కేటాయించాలని కోరుతూ ఏఐసీసీ ఓబీసీ సెల్ జాతీయ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్ తదితరులు ఆదివారం ఢిల్లీలో వార్‌రూం ఎదుట ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ క్రమంలో తాజాగా మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ వద్ద నాగర్‌కర్నూల్ టికెట్ నాగం జనార్దన్‌రెడ్డికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ నాగంతో సహా ఆయన కుమారుడు నాగం శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వర్గీయులు ఆందోళనకు దిగారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని అడ్డుకున్నారు. ఈ పరిణామాలు హాట్‌టాపిక్‌గా మారగా.. కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు వారిని సముదాయించినట్లు తెలుస్తోంది.

ఎవరికి వారు.. 'హస్తం' శ్రేణుల్లో ఆందోళన

కొల్లాపూర్‌లో టీపీసీసీ సభ్యుడు చింతల జగదీశ్వర్‌రావు, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు.. వనపర్తిలో మాజీ మంత్రి చిన్నారెడ్డి, మేఘారెడ్డి.. దేవరకద్ర నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌గౌడ్ పోటీపడుతున్నారు. ఈ స్థానం నుంచి యూత్ కేటగిరిలో తనకు అవకాశం ఇవ్వాలని కొండా ప్రశాంత్‌రెడ్డి కోరుతున్నారు. మక్తల్‌కు అవకాశం దక్కని పక్షంలో ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు సీతాదయాకర్‌రెడ్డి కుమారుడు సిద్ధార్థ్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. దీంతో టికెట్ల ఖరారు అంశం కాంగ్రెస్ పెద్దలకు తలనొప్పిగా మారింది. బీఆర్‌ఎస్ గత ఎన్నికల్లో వ్యవహరించిన విధంగానే ముందస్తుగానే అభ్యర్థులను ప్రకటించడం.. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ అసంతృప్తుల బెడదతో కాంగ్రెస్‌లో ఇంకా అభ్యర్థులను ఖరారు చేయకపోవడం కొంప ముంచేలా ఉందని హస్తం శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కట్టుదిట్టంగా ఎన్నికల నియమావళి అమలు



మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కంట్రోల్ రూం కాల్ సెంటర్‌పై నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాల్ సెంటర్ కంట్రోల్ రూం ఎంజీఆర్‌ఎస్ డీసీసీ పోర్టల్ సీ విజిల్ యాప్‌ల పర్యవేక్షణ, ఫిర్యాదుల స్వీకరణలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. 24 గంటలపాటు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సందేహాలు నివృత్తి చేయడంతో పాటు ఫిర్యాదులపై తక్షణమే స్పందించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఫిర్యాదుల విభాగం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. శిక్షణలో పొందిన ప్రతి అంశాన్ని తూ.చ. తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, ఎన్నికల నోడల్ అధికారులు నర్సింగ్‌రావు, కృష్ణ, రమాదేవి, నరేష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.లక్షకుపైగా లావాదేవీల వివరాలివ్వండి

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని బ్యాంకుల్లో రూ.లక్షకు పైగా లావాదేవీలు జరిగే ఖాతా వివరాలు ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. వివిధ బ్యాంకుల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రులు, భూ క్రయవిక్రయాలు, వివాహాలకు సంబంధించి నగదు, బంగారం తీసుకెళ్తే సంబంధిత ఆధారాలు కచ్చితంగా చూపాలని స్పష్టం చేశారు. అవే నిబంధనలు బ్యాంకులకు కూడా వర్తిస్తాయని, లావాదేవీల తరలింపు విషయంలో అధికారులు స్పష్టమైన పత్రాలను వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు జాతీయ బ్యాంకు పరిధిలో నూతనంగా కరెంట్ అకౌంట్ పొందాల్సి ఉందని, చెక్ బుక్‌లను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ఎన్నికల్లో చేసే ఖర్చు వివరాలను బ్యాంక్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఆన్‌లైన్ యూపీఐ, గూగుల్, ఫోన్ పే లావాదేవీలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఏటీఎం రీఫిలింగ్, బ్యాంకులకు డబ్బు రవాణా చేసే క్రమంలో ప్రైవేటు ఏజెన్సీలు, సిబ్బంది నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను బ్యాంకర్లు తూ.చ. తప్పకుండా పాటించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, లీడ్ బ్యాంకు మేనేజర్ కౌశల్ కిశోర్ పాండే, జిల్లా నోడల్ అధికారి శ్రీనివాసబాబు, ఎన్నికల తహసిల్దార్ జాకీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై ఫిర్యాదుకు సీ విజిల్ యాప్

ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అభ్యర్థుల దుష్ప్రవర్తన సంబంధిత ఫొటోలు, వీడియోలను సీ విజిల్ యాప్‌లో నమోదు చేస్తే.. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లోనే ఎన్నికల విభాగం అధికారులు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల ప్రజలు ఈ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఇందులో పంపిన సమాచారం నేరుగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వెళ్తాయని, వారు వెనువెంటనే చర్యలు చేపడుతారన్నారు. బాధ్యతగల పౌరులు ఈ యాప్‌ను ఉపయోగిస్తే ఎన్నికల్లో నాయకుల అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. సీ విజిల్ నోడల్ అధికారి ఈ డిస్ట్రిక్ మేనేజర్ నరేష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సీ విజిల్ 24 గంటలు పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు.

మానసిక ఆరోగ్యంపై యువతకు అవగాహన

కందనూలు: సబ్ స్టాన్స్ డ్రగ్ అబ్యూస్‌పై యువతకు అవగాహన కల్పించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెంటల్ హెల్త్ ఈజ్ యూనివర్సల్ హ్యూమన్ రైట్ థీమ్‌తో ఈ ఏడాది కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. సబ్ స్టాన్స్ డ్రగ్ అబ్యూస్ ప్రమాదకరం అని, దీనిపై యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ వాడటం వలన వచ్చే అనర్థాలను వివరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘు మాట్లాడుతూ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రతి మనిషికి, మానసిక ఆరోగ్యాన్ని ఇవ్వడం ప్రభుత్వం యొక్క బాధ్యతగా, ప్రతిఒక్కరి హక్కుగా పేర్కొన్నారు. మానసిక వైద్యనిపుణులు వైష్ణవి మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ప్రతిఒక్కరు కలిగి ఉన్నట్లయితే సమాజమంతా ఆరోగ్యవంతంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయ్‌కుమార్, జ్యోతి, వైద్య కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'కి ప్రణాళిక

- వచ్చే ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు
- ఇప్పటికే కొనసాగుతున్న గ్రామసభలు
- గతేడాది లక్ష్యానికి పనిదినాల కల్పన



కల్వకుర్తి మండలం కుర్మిద్దలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

నాగర్‌కర్నూల్: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి.. కూలీలకు స్థానికంగా ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకునే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే గ్రామాల్లో ఎలాంటి పనులు చేపట్టాలి.. ప్రాముఖ్యత ఏ పనులకు ఇస్తే గ్రామం అభివృద్ధి చెందుతుందనే అంశంపై ప్రతి సంవత్సరం గ్రామసభలు నిర్వహించి పనులను ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగానే 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని ఆయా గ్రామాల్లో పనుల గుర్తింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. వచ్చే నెల చివరి వరకు పనులను గుర్తించి జిల్లావ్యాప్తంగా ప్రణాళిక తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నారు. అయితే ఉపాధి పనుల గుర్తింపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు సైతం విడుదల చేసింది. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శి, రైతులు, గ్రామప్రజలు, ఉపాధి హామీ సిబ్బందితో గ్రామసభ ఏర్పాటు చేసి పనులకు ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. శ్మశాన వాటికల నిర్మాణం, ఇంకుడు గుంతలు, పశువుల షెడ్లు, నీటి తొట్లు, నర్సరీలు, కల్లాలు, చెక్ డ్యాంలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, కాల్వల పూడికతీత తదితర పనులను గుర్తించి మండల కార్యాలయానికి నివేదించాల్సి ఉంటుంది.

వచ్చే నెలాఖరు వరకు..

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులను గుర్తించేందుకు వచ్చే నెల 30 వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. అయితే గతంలో ఉపాధి హామీ కి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించి.. వారి బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించడంతో కొంతమేర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో వందశాతం లక్ష్యాలను సాధించారని చెప్పవచ్చు. ఏదేమైనా ఉపాధి హామీ పనుల్లో వందశాతం లక్ష్యాలను పూర్తి చేస్తే కూలీలకు ఉపాధి దొరకడమే కాకుండా గ్రామాల్లో అనుకున్న స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతాయి.

జిల్లా పరిధిలో ఇలా..

ఉపాధి జాబ్‌కార్డులు 1.90 లక్షలు	మొత్తం కూలీలు 3.66 లక్షలు
ప్రస్తుతం పని చేస్తున్న వారు : 1.86 లక్షలు	గతేడాది కల్పించిన పనిదినాలు 22 లక్షలు
పనిచేసిన రోజులు 27.94 లక్షలు	చెల్లించిన డబ్బులు రూ.51.49 కోట్లు
వందశాతం పనులు చేసిన కుటుంబాలు 813	

ప్రణాళిక సిద్ధం చేస్తాం..



వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతి పంచాయతీలో గ్రామ సభ నిర్వహించి పనులను గుర్తిస్తున్నాం. వచ్చే నెల చివరి వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో పనులను గుర్తించి ప్రణాళిక రూపొందిస్తాం. – నర్సింగ్‌రావు, డీఆర్‌డీఓ

విద్యా సామర్థ్యాల పెంపునకు కృషిచేయాలి

కందనూలు: విద్యా సామర్థ్యాలు అందించడం ప్రభుత్వ యొక్క చట్టబద్ధ బాధ్యతగా గుర్తించాలని స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. మంగళవారం జిల్లాకేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య, సామర్థ్యాలు అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లుల సంఘం జిల్లా కన్వీనర్ మల్లీశ్వరి మాట్లాడుతూ పాఠశాల విద్యా వ్యవస్థలో యూడీఐఎస్‌ఈ ఆధారంగా రాష్ట్రాలు, జిల్లాల వారీగా పనితీరును కేంద్ర ప్రభుత్వం లెక్కిస్తుందని చెప్పారు. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లా పనితీరును పరిశీలిస్తే విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలలో మొత్తం 790 పాయింట్లకు 95 పాయింట్లతో రాష్ట్రస్థాయిలో 31వ స్థానం, దేశంలో ఉన్న 748 జిల్లాలకు గాను 717వ స్థానంలో నిలవడం ఆందోళన కలిగించే విషయం అన్నారు. ఇక పరిశీలించిన ఆరు అంశాల్లో మొత్తం 600 పాయింట్లకు 296 పాయింట్లతో దేశంలో 628వ స్థానంలో నిలిచిందని వివరించారు. 2021 నవంబర్‌లో దేశవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) ప్రకారం జిల్లాలో విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తే 8వ తరగతి విద్యార్థులు తెలుగులో 43 శాతం, లెక్కలలో 34 శాతం, సామాన్య శాస్త్రంలో 34 శాతం, సాంఘిక శాస్త్రంలో 34 శాతంతోపాటు పదో తరగతి విద్యార్థులు తెలుగులో 37 శాతం, లెక్కలలో 30 శాతం, సామాన్యశాస్త్రంలో 33 శాతం, సాంఘిక శాస్త్రంలో 34 శాతం, ఇంగ్లిష్‌లో 40 శాతం మాత్రమే కలిగి ఉన్నారని ఆందోన వ్యక్తం చేశారు. సామాజిక వర్గాల వారిగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల గణాంకాలు చూస్తుంటే ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం 'పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (2021–22)'ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చయ్య, సురేష్, వెంకటేశ్వర్, శివ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోటల్‌లో ఉరి వేసుకుని వర్కర్ మృతి

- మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు యజమాని, తోటి వర్కర్లపై కేసు నమోదు

జడ్చర్ల: స్థానిక ఓ హోటల్‌లో పనిచేసే ఓ యువకుడు హోటల్ రూమ్‌లో ఉరి వేసుకుని అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన మంగళవారం జడ్చర్లలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా చౌదరిగూడకు చెందిన మిర్యాల అనిల్(19) స్థానిక రెడ్డి హోటల్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల సొంత ఊరుకు వెళ్లిన అనిల్‌ను హోటల్ యజమాని జయరాజ్ ఫోన్ చేసి తిరిగి రప్పించాడు. మంగళవారం హోటల్‌లోని గదిలో అనిల్ సుతిలి తాళ్లతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. తెల్లవారుజామున హోటల్ యజమాని జయరాజ్ గమనించి మృతుడి తల్లి మిర్యాల లక్ష్మమ్మకు ఫోన్ చేసి విషయం తెలియజేశాడు. తల్లి లక్ష్మమ్మ, మరో కుమారుడు ధనుంజయ్ హోటల్ వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. తమ కుమారుడి చావుకు హోటల్ యజమాని జయరాజ్‌తో పాటు హోటల్ వర్కర్స్ శ్రీశైలం, శివకుమార్, యాదగిరి, కేశవ్, శ్రీకాంత్ కారణమని, తన కుమారుడి మరణంపై అనుమానాలు ఉన్నాయని తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

కందకంలో పడి..

మన్ననూర్: అమ్రాబాద్ అభయారణ్యం సరిహద్దుల కోసం అటవీశాఖ తీసిన కందకంలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన లింగమయ్యస్వామి చెక్‌పోస్టు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. అచ్చంపేట మండలం బొమ్మనపల్లికి చెందిన జంగయ్య (38) కొంతకాలంగా ప్రశాంతినగర్‌లోని తన అక్క పార్వతమ్మ వద్ద ఉంటున్నాడు. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ, వచ్చిన డబ్బులతో తరుచుగా మద్యం తాగేవాడు. సోమవారం మద్యం మత్తులో చెక్‌పోస్టు సమీపంలోని కందకాన్ని దాటే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తలభాగం నీటిలో మునిగిపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అమ్రాబాద్ మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ..

మహమ్మదాబాద్: మండల కేంద్రానికి చెందిన కోస్గి రాములు (38) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా భవనాల కూల్చివేత పనులు చేపడుతున్నారు. ఇటీవల అతడికి ప్రమాదవశాత్తు ఇనుప చువ్వలు తగలడంతో తీవ్రగాయాలు అయ్యాయి. అతడిని హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

రాజనగరంలో మరొకరు..

పెబ్బేరు రూరల్: మూర్ఛవ్యాధితో వ్యక్తి మృతి చెందిన ఘటన వనపర్తి మండలం రాజనగరం గ్రామశివారులో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ నాగన్న వివరాల మేరకు.. పాన్‌గల్‌కు చెందిన మంగళి సతీష్ (40), వనపర్తి మండలం నాగవరం గ్రామానికి చెందిన సుజాతతో వివాహమైంది. అతడు ఇక్కడే పని చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిస కావడంతో అనారోగ్యానికి గురయ్యాడు. అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చేది. ఈ క్రమంలో సోమవారం రాత్రి భోజనం చేసి బయటికి వచ్చిన అతడు.. రాజనగరం గ్రామశివారులో శవమై కనిపించాడు. ఫిట్స్ రావడంతో రోడ్డుపై పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు (32) దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ నాగరాజు వివరాల మేరకు.. సోమవారం అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో జడ్చర్ల నుంచి భూత్పూర్ వైపు బైక్‌పై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి అదుపు తప్పి కిందపడ్డాడు. బైక్ వెనుకాలే వేగంగా వస్తున్న కంటెయినర్ లారీ అతడి మీదుగా వెళ్లడంతో తలపగిలి దుర్మరణం చెందాడు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా మారింది. మృతుడు ఆకుపచ్చ రంగు షర్ట్, కుడి చేతిపై ఆంగ్లంలో అను అనే పచ్చబొట్టు కలిగి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని బాదేపల్లి మార్చురీకి తరలించామని, కంటెయినర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెబ్బేరు రూరల్: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శ్రీరంగాపురంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటస్వామి వివరాల మేరకు.. పాన్‌గల్ మండలం దావాజిపల్లికి చెందిన పసుపుల దాసు (40)కు శ్రీరంగాపురం గ్రామానికి చెందిన అనితతో 16ఏళ్ల కిందట వివాహమైంది. కొన్ని రోజులుగా దాసు మద్యానికి బానిసై భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలోనే ఈనెల 8న పనికి వెళ్లిన అతడు తిరిగిరాలేదు. మంగళవారం గ్రామ సమీపంలోని రంగసముద్రం గట్టుపై చెట్టుకు ఉరి వేసుకున్న దాసును గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉల్లం‘ఘను’లపై నిఘా

- పకడ్బందీగా ఎన్నికల నియామవళి అమలు
- పార్టీల ఫ్లెక్సీలు, ప్రచార బోర్డుల తొలగింపు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు



దేవరకద్రలో గోడరాతలను తుడిపేస్తున్న సిబ్బంది

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల నిబంధనల అమలుపై ఈసీ ప్రత్యేక దృష్టి సారించింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆయా పార్టీల కదలికలపై నిఘా పెట్టింది. ఇప్పటికే అధికార యంత్రాంగం నుంచి రోజు వారీగా నివేదికలు సేకరిస్తోంది. ఈ మేరకు నిఘా వర్గాలు కోడ్ ఉల్లంఘనలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. దీంతో పాటు ప్రచారంలో అభ్యర్థులు వ్యవహరించే తీరు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, ధన ప్రభావం వంటి విషయాలపై పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఎన్నికల నిబంధనల మేరకు ప్రభుత్వ పథకాల ప్రచారం పూర్తిగా నిలిపివేయాలని, పథకాల పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్ ఆదేశాలు జారీ చేశారు.

74గంటల్లో మొత్తం తొలగింపు..

ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన 24 గంటల్లోగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫొటోలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించారు. 48 గంటల్లోగా అన్ని పబ్లిక్ స్థలాలు, 74 గంటల్లోగా ప్రైవేటు స్థలాల్లో ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉంది. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా ఫ్లెక్సీలు, పోస్టర్ల తొలగింపును ముమ్మరం చేశారు.

అభ్యర్థుల ప్రచారంపై ప్రత్యేక దృష్టి..

ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున వారి కుటుంబ సభ్యులు ప్రచారం ప్రారంభించారు. ఆయా పార్టీల అభ్యర్థులు ఇంకా ప్రచారంలోకి దిగలేదు. సామాజిక సేవా కార్యక్రమాల పేరిట అభ్యర్థులు నిర్వహించే కార్యక్రమాలు, రహస్య సమావేశాలు, ధన, మందు ప్రవాహంపై ఎన్నికల అధికారులు దృష్టి సారించారు. సామాజిక మాధ్యమాల్లో పెట్టే పోస్టులనూ వదలమని స్పష్టం చేశారు. అభ్యర్థుల తరఫున పెట్టే పోస్టులపై జిల్లా అధికారులు నివేదికలు పంపుతున్నారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో ఎన్నికల అధికారుల వ్యవహార తీరు, ఫిర్యాదులపై స్పందించే విధానంపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని ఆదేశాలు జారీ అయ్యాయి.



జిల్లా కేంద్రంలో..

అనుమతి తప్పనిసరి..

ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలకు తప్పనిసరిగా అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇందుకు డీఎస్పీ వద్ద దరఖాస్తు చేసుకోవాలి. కార్యక్రమం చేపట్టే కంటే ముందుగానే దరఖాస్తు సమర్పించాలి. సభకు ఎంత మంది హాజరువుతారు? ఎంతసేపు కొనసాగుతుంది? వాహనాలు ఎన్ని? మైక్‌ల ఏర్పాటు వంటి విషయాలపై పూర్తి సమాచారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. కోడ్‌కు లోబడి అనుమతులు జారీ చేస్తారు. ప్రైవేటు స్థలాల్లో ప్రచారానికి యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ఉమ్మడి జిల్లాలో రూ.లక్షల్లో పట్టుబడిన నగదు

జడ్చర్ల: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా వాహనాల తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో జడ్చర్ల వద్ద మంగళవారం కారులో తనిఖీ చేయగా శంషాబాద్ నుంచి దేవరకద్రకు వెళ్తున్న కారులో రూ.10 లక్షలు లభించినట్లు స్థానిక సీఐ రమేశ్‌బాబు తెలిపారు. శంషాబాద్‌కు చెందిన యాదయ్య దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో భూమి కొనుగోలుకు సంబంధించి రిజిస్ట్రేషన్ కోసం వెళ్తున్నట్లు బాధితుడు తెలిపారు. కాగా ఇటీవల రెండు రోజుల క్రితం కూడా ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు చేపట్టామని ఇప్పటి వరకు మొత్తం రూ.23 లక్షలు పట్టుబడినట్లు సీఐ చెప్పారు.

గద్వాలలో చీరలు..

గద్వాల క్రైం: జిల్లాకేంద్రం శివారులోని అయిజ–గద్వాల రోడ్డు మార్గంలో మంగళవారం బెంగుళూర్ నుంచి గద్వాలకు తరలిస్తున్న రూ.1.40 లక్షల విలువ గల చీరలను పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. అలాగే గద్వాల–రాయిచూర్ రోడ్డు మార్గంలో రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తనిఖీలు చేపట్టగా.. ధరూర్ మండలం కోతులగిద్దకు చెందిన వ్యక్తి రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో జిల్లా స్క్రీనింగ్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు.

వెంకట్రామనగర్‌లో రూ.లక్ష..

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని వెంకట్రామనగర్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం వాహనాలు తనిఖీ చేస్తుండగా అయిజ మండలం రాజాపురం గ్రామానికి చెందిన సలీంబాషా తన వాహనంలో రూ.లక్ష తరలిస్తుండగా పట్టుకున్నట్లు శాంతినగర్ ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

అచ్చంపేటలో రూ.1.63 లక్షలు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట సర్కిల్ పోలీసులు మంగళవారం చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రాములు అనే వ్యక్తి వద్ద రూ.1.63 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వీటికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో డబ్బులను ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

అయిజలో రూ.2.49 లక్షలు..

అయిజ: పట్టణంలో సోమవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించగా ఉప్పలదొడ్డిపేటకు చెందిన వ్యక్తి నుంచి రూ.2,49,900 నగదును స్వాధీనం చేసుకున్నారు. పంటను విక్రయించగా వచ్చిన డబ్బులు సదరు వ్యక్తి చెప్పడంతో ఆధారాలు చూపించి తీసుకెళ్లాలని పోలీసులు పేర్కొన్నారు.

‘నార్లాపూర్’కు 2 టీఎంసీల నీటి విడుదల



వడ్డెగుడిసెల్లోకి చేరిన నీళ్లు

కొల్లాపూర్ రూరల్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి 2 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు డీఈ లోకిలాల్ తెలిపారు. నాలుగు రోజుల పాటు మొదటి లిఫ్ట్ నుంచి ఒక పంపు ద్వారా నీటి పంపింగ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరానికి సంబంధించి నీటి విడుదల పూర్తి కావడంతో మంగళవారం ఉదయం 11గంటలకు పంపును బంద్ చేసినట్లు తెలిపారు. పాలమూరు ఎత్తిపోతలకు సంబంధించి రెండో మోటారు పనులు పూర్తికావొచ్చాయని, నార్లాపూర్ రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీటిని మంచినీటి అవసరాలకు వినియోగిస్తామన్నారు.

నిర్వాసితుల ఇళ్లలోకి నీళ్లు

కొల్లాపూర్: నార్లాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన వడ్డె గుడిసెల్లోకి నీళ్లు చేరాయి. ఇక్కడ నివాసం ఉన్న వారు ఖాళీ చేయాలని అధికారులు సూచించినా.. పరిహారం విషయంలో అసంతృప్తిని వ్యక్తం చేస్తూ కొందరు నివాసముంటున్నారు. రిజర్వాయర్‌లో క్రమంగా నీళ్లు పెరుగుతుండడంతో గ్రామస్తులంతా తమ నివాసాలను ఖాళీ చేసి సమీప ప్రాంతాల్లోకి వెళ్లిపోయారు. ప్రభుత్వం స్పందించి వడ్డెగుడిసెలు గ్రామస్తులకు న్యాయబద్ధమైన పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.



పాలమూరు ఎత్తిపోతల నుంచి నార్లాపూర్ రిజర్వాయర్‌కు విడుదలవుతున్న నీళ్లు

మన్యంకొండలో వైభవంగా అగ్నిగుండం

- ముగిసిన వీరభద్రస్వామి ఉత్సవం



అగ్నిగుండానికి హాజరైన భక్తులు



వీరభద్రస్వామికి హారతి ఇస్తున్న అళహరి రామకృష్ణ

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని వీరభద్రస్వామి అగ్నిగుండం కార్యక్రమం మంగళవారం తెల్లవారుజామున వైభవంగా కొనసాగింది. ప్రతి సంవత్సరం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి వారి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగానే దేవస్థానం ముందు అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దేవస్థానం వద్ద జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి సంకీర్తనలను ఆలపిస్తూ నందికోళ సేవ నిర్వహించారు. ఖడ్గాలను చదివారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహంతో దేవస్థానం నుంచి సమీపంలోని కోనేరు వద్దకు వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. తిరిగి స్వామివారిని కోనేరు నుంచి దేవస్థానం ముందున్న అగ్నిగుండం ప్రాంతానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాల మధ్య మహిళలు మంగళ హారతులతో ముందు నడుస్తుండగా ఈ ఊరేగింపు కదిలింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి తడిగుడ్డలతో దేవస్థానం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండం ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం అగ్ని గుండానికి మహా మంగళహారతి పూజా కార్యక్రమం నిర్వహించారు. దీంతో స్వామివారి ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సకాలంలో స్పందించి కాపాడిన పోలీసులు



ఖిల్లాఘనపురం: ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తిని పోలీసులు ప్రాణాలతో కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని వెంకటాంపల్లికి చెందిన సత్యనారాయణరెడ్డి కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి మద్యం తాగిన అతడు.. గ్రామ సమీపంలోని విద్యుత్ స్తంభంపై ఉరేసుకునేందుకు యత్నిస్తుండగా, గ్రామస్తులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. పోలీస్ సిబ్బంది స్టీఫెన్, నాగిరెడ్డి, రాజు, శ్రీనివాసులు, బాలవర్ధన్ వెంకటాంపల్లికి చేరుకుని విద్యుత్ స్తంభం ఎక్కారు. తాడుతో ఉరేసుకున్న అతడు ప్రాణాలతోనే ఉన్నాడని గుర్తించి, వెంటనే కిందకు తీసుకొచ్చారు. అతడికి ఆస్పత్రిలో చికిత్స చేయించినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

గోవా మద్యం పట్టివేత



కృష్ణా: మండలంలోని చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఎక్సైజ్, సివిల్ పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. వీఆర్ఎల్ ట్రావెల్ బస్సులో గోవా నుంచి తీసుకొస్తున్న 12.7 లీటర్ల మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గోవా నుంచి మద్యాన్ని తీసుకొస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది సయ్యద్‌బాషా, మల్లన్‌గౌడ్, రహెమత్ పాషా, రాంచంద్రయ్య, అబ్దుల్ రియాజ్, ఇలియా ఉన్నారు.

మోసం చేసిన పార్టీలను భూస్థాపితం చేస్తాం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



పాదయాత్ర చేస్తున్న మందకృష్ణ

మానవపాడు/ ఎర్రవల్లి చౌరస్తా: పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మాదిగలను మోసం చేసిన పార్టీలను భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఆయన చేపట్టిన మహా పాదయాత్ర మంగళవారం మానవపాడు మండలంలోని చందూరు, పల్లెపాడు, ఎర్రవల్లి మండలంలోని ఆర్.గార్లపాడు, కారుపాకుల, బి.వీరాపురం, దువాసిపల్లి, సాసనూలు, షేకుపల్లి, ఎర్రవల్లి మీదుగా బీచుపల్లికి చేరుకుంది. ఆయా గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలకగా.. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు అందరికీ సమానంగా అందడం లేదన్నారు. ఎస్సీ కులాల్లో ఉన్న మధ్య తీవ్రమైన అసమానతలు పెరిగి.. ఒక వర్గం వారే లాభం పొందుతున్నారన్నారు. రిజర్వేషన్లు అందని మాదిగ ఉపకులాలు తీవ్రంగా నష్టపోయాయని, అందుకే ఎస్సీ రిజర్వేషన్ చేపట్టి మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయంగా హైదరాబాద్‌లో వచ్చే నెల 7న మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు గోవిందు, నరేష్, నరేంద్రబాబు, కార్తిక్, మస్తాన్, భీమన్న, రాజు, రాజేష్, మోషా, ఎలీషా, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు రావాలని గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అర్చకులు, ఈఓ

జోగుళాంబ శక్తిపీఠం: తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో జరిగే దేవీశరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరు కానున్నారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ హైదరాబాద్ రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిశారు. ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే దేవీశరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలంటూ కోరుతూ ఆహ్వానిస్తూ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన జోగుళాంబ ఆలయంలో జరిగే శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల ప్రత్యేకతను తెలియజేశారు. నవరాత్రుల్లో తాను ఏరోజు వస్తాననే విషయంపై రాజ్‌భవన్ కార్యాలయం త్వరలో దేవస్థానానికి తెలియజేస్తుందని, తాను ఏదేని ఒకరోజు తప్పకుండా హాజరవుతానంటూ స్పందించారు. అనంతరం ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

జూరాలకు స్వల్ప వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద స్వల్పంగా వస్తోంది. మంగళవారం రాత్రి 7గంటల వరకు 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 119, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 3,845 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.255 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

శ్రీశైలంలో 852.3 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 852.3 అడుగుల వద్ద 85.2060 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 4,375, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,688, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,083 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 10.353 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి, 21,070 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 148 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాడులో 1,020 అడుగులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం 1,020 అడుగులకు నీటి నిల్వ చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030, సమాంతర కాల్వ నుంచి 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 1,250, కుడి కాల్వకు 10, ఎడమ కాల్వకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్–2 ద్వారా 851, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

అయిజ: వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందాడని ఆరోపిస్తూ స్థానిక సన్‌రైజ్ ఆస్పత్రి ఎదుట మంగళవారం బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. వారి వివరాల మేరకు.. మండలంలోని బింగుదొడ్డికి చెందిన పరుశరాముడు (40) అనారోగ్యంతో సోమవారం సన్‌రైజ్ ఆస్పత్రిలో చేరాడు. మంగళవారం అతడి పరిస్థితి విషమించడంతో కర్నూల్‌కు తీసుకెళ్లాలని ఆస్పత్రి డాక్టర్ సూచించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు అతడిని కర్నూల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు అయిజకు చేరుకొని సన్‌రైజ్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. సోమవారమే కర్నూలుకు తీసుకెళ్లాలని చెప్పి ఉంటే వ్యక్తి బతికేవాడని, ఒక రోజంతా మీ ఆస్పత్రిలో ఎందుకు చికిత్స చేశారని వైద్యుడిని నిలదీశారు. కాగా పరుశరాముడికి గుండెపోటు వచ్చిందని, అది తనకు ముందుగానే ఎలా తెలుస్తుందని ఆస్పత్రి డాక్టర్ తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. ఇలాంటి ఘటనలు ఆస్పత్రుల్లో తరచూగా చోటుచేసుకుంటున్నాయని, ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధిక సాంద్రతపై అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి

బిజినేపల్లి: పత్తిలో అధిక సాంద్రత పద్ధతిపై క్లస్టర్ ఏఈఓలు రైతులకు అవగాహన కల్పించాలని పాలెం కేవీకే సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పాలెం కేవీకేలో ఏఈఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు పెంచడం వల్ల పంటకాలం తగ్గుతుందన్నారు. పత్తి కోత అనంతరం మరో పంటకు అవకాశం ఉంటుందన్నారు. అధిక సాంద్రతలో పత్తి సాగుపై క్షేత్రస్థాయిలో రైతులకు పరిశోధనాత్మకంగా అవగాహన కల్పించాలని ఏఈఓలకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.